

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

# రైతులు ముందస్తుగా వరి సాగు చేపట్టాలి

**అధికారుల సూచనలు పాటించాలి**

**సేంద్రియ వ్యవసాయం చేయాలి**

**అదనపు కలెక్టర్ సంధ్యారాణి**

నర్సంపేట, జూన్ 8: అధిక దిగుబడి కోసం రైతులు వరి సాగును ముందస్తుగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర'లో భాగంగా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ముగ్దుంపురంలో ఆదివారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిని ముందుగా సాగు చేయడం వల్ల అధిక దిగుబడితోపాటు తెగుళ్లు, చీడపీడల ప్రభావం తగ్గించుకోవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. వ్యవసాయంతోపాటు పశుపోషణ, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ విత్తనాల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పంటల సాగులో తక్కువ యూరియా వాడాలని, అధికారుల సూచనల మేరకే రసాయనాలు వినియోగించాలన్నారు. ప్రతి రైతు పంట మార్పిడి పాటించాలని కోరారు. తక్కువ నీటిని వినియోగించాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు విధిగా రసీదు తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యే వరకూ జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఏవో అనురాధ, శాస్త్రవేత్తలు డాక్టర్ రాజు, డాక్టర్ వెంకన్న, డాక్టర్ వీరన్న, నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఏవో కృష్ణకుమార్, ఏఈవో మెండు అశోక్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నుంచి 2వ వార్డు అధ్యక్షుడి సస్పెన్షన్

నర్సంపేట, జూన్ 8: బీఆర్‌ఎస్ నుంచి నర్సంపేట 2వ వార్డు అధ్యక్షుడు పోతరాజు బాబును సస్పెండ్ చేసినట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెళ్లి వెంకటనారాయణగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ కమలాపురం 2వ వార్డు అధ్యక్షుడు పోతరాజు బాబును మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాలతో సస్పెండ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఇకనుంచి బాబుకు బీఆర్‌ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## కట్టమల్లన్న ఆలయంలో చోరీ

గీసుగొండ, జూన్ 8: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కట్టమల్లన్న ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీఐ మహేందర్ తెలిపారు. ఆదివారం ఆలయానికి వచ్చిన స్వీపర్ సూరయ్య ఆలయాన్ని శుభ్రం చేస్తుండగా తాళాలు పగలగొట్టి ఉండడంతో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావుకు సమాచారం ఇచ్చాడు. ఈవో వచ్చి సీఐ మహేందర్‌కు ఫిర్యాదు చేశారు. హుండీలోని సుమారు రూ. 3 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు సీఐ తెలిపారు.

## రైతులు దరఖాస్తులు అందజేయాలి

ఖానాపురం, జూన్ 8: భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోని రైతులు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయొచ్చని ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ తెలిపారు. ఏదేని కారణంతో దరఖాస్తు చేసుకోలేని రైతులు గ్రామసభలు ముగిసేలోగా తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని సూచించారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

కరీమాబాద్, జూన్ 8: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌ఆర్‌ఆర్‌తోటలో ఆదివారం పోలీసులు ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు రూ. 2,11,500 విలువైన 70.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

sf సుందరం హోమ్

**నమోదిత కార్యాలయం:** నెం. 21, పటుల్లాస్ రోడ్, చెన్నై-600 002.
**కార్పొరేట్ కార్యాలయం:** సుందరం టవర్స్, నెం. 46, వైట్స్ రోడ్, చెన్నై-600 014.
**శాఖ కార్యాలయం:** 1వ అంతస్తు, కండకట్ల గేట్‌వే, KUC X రోడ్, నయీమ్ నగర్, హన్మకొండ, వరంగల్-506009, ఫోన్: 0870-2441244.

**స్వాధీనతా ప్రకటన**

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని అనుబంధం-IV మరియు రూల్ 8(1)తో చదువబడే సెక్షన్ 13(4) క్రింద జారీ చేయబడినది**

**సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (SARFAESI) యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **రుణగ్రహీత: కుమారి శ్యామల యాదాల, సహ-రుణగ్రహీత: శ్రీమతి సరోజన యాదాల** వారికి సెక్షన్ 13(2) క్రింద **29-11-2024** తేదీగల **డిమాండ్ నోటీసు**ను జారీచేసి, 20.12.2024న సదరు నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజుల్లోగా 29.11.2024 నాటికి **లోన్ అకౌంట్ నెంబర్: WGL20230057** క్రింద చెల్లించాల్సిన మరియు నోటీసులో తెలిపిన బకాయి మొత్తం **రూ.53,30,670/- (యాభై మూడు లక్షల ముప్పై వేల ఆరు వందల డెబ్బై రూపాయలు మాత్రమే)** + చెల్లింపు వాస్తవ తేదీ వరకు తదుపరి వడ్డీ + వ్యయాలు మరియు ఖర్చులను మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా కోరుతున్నారు.
రుణగ్రహీత(లు) పైన తెలిపిన ప్రకారం మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడం చేత, SARFAESI చట్టంలోని రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి అధీకృత అధికారి దిగువ వివరించబడిన ఆస్తిని **05-06-2025**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలసిందిగా రుణగ్రహీతకు తెలియజేయడమైనది.
సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీ నిర్వహించరాదని మరియు సదరు ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు **05-06-2025** నాటికి **రూ. 53,44,685/- (యాభై మూడు లక్షల నలభై నాలుగు వేల ఆరు వందల తొంభై ఐదు రూపాయలు మాత్రమే)** వాస్తవ చెల్లింపుతేది వరకు, తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర చార్జీలు కలిపి సదరు మొత్తం కొరకు **సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** చార్జ్‌కు లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.
**ఆస్తి షెడ్యూల్:** రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్ మరియు సబ్‌రిజిస్ట్రార్ వరంగల్ ఫోర్ట్ పరిధిలో, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, వరంగల్ సిటి మరియు జిల్లా, ఖిలా వరంగల్ మండలం, రామగోపాలపురం వద్ద గల, తిమ్మాపూర్ గ్రామంలోని సర్వే నెం.259లో, 139.34 చ.మీటర్లకు సమానమైన 166.66 చ.గజాలు మొత్తం విస్తీర్ణం, 942.00 చ.అ. ఆర్‌సిసి ప్లింత్ ఏరియా (ఇం.నెం.33-6-508/4 ప్రక్కన) చే కవర్ చేయబడిన (ఇం.నెం.కేటాయించబడలేదు) ఖాళీ ప్రదేశం ఆస్తితో సగం పూర్తయిన ఆర్‌సిసి రూఫ్ ఇల్లు. **సరిహద్దులు: తూర్పు:** రోడ్, **పడమర:** బొల్ల వెంకన్న (విక్రయదారు) ఖాళీ ప్లాట్, **ఉత్తరం:** 6-0 లేన్, **దక్షిణం:** డి.ప్రభాకర్ ఖాళీ ప్లాట్. ఇది SRO వరంగల్ ఫోర్ట్, టైటిల్ డీడ్ నెం. 9326/2022లో మరింత పూర్తిగా మరియు ప్రత్యేకంగా వివరించబడినది.

**తేది: 05-06-2025**

**సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున, అధీకృత అధికారి.**

# సర్కారు బడుల్లో మెరుగైన విద్య

- **13వ డివిజన్ కార్పొరేటర్ సురేశ్ జోషి**
- **ఊరూరా బడిబాట కార్యక్రమం**

పోచమ్మమైదాన్, జూన్ 8: సర్కారు బడుల్లోనే పిల్లలకు మెరుగైన విద్య అందుతుందని 13వ డివిజన్ కార్పొరేటర్ సురేశ్ జోషి అన్నారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ మాసూం అలీ ఉన్నత పాఠశాలలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. హెచ్‌ఎం డాక్టర్ బీవీఎన్ స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నాయని, పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఖానాపురం: మనుబోతులగడ్డలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



పోచమ్మమైదాన్: మాట్లాడుతున్న కార్పొరేటర్ సురేశ్ జోషి

కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ మౌలాలి చైర్మన్ సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దేశాయిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాటలో వరంగల్ ఎంఈవో గంప అశోక్‌కుమార్, కార్పొరేటర్ కావటి కవితా రాజు యాదవ్, సామాజికవేత్త డాక్టర్ పాలడుగు సురేందర్, హెచ్‌ఎం చక్రపాణి, ఉపాధ్యాయులు పాలొన్నారు. కొత్తవాడలోని గిర్మాజీపేట పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ, హెచ్‌ఎం నాగమణి, భూపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చార్‌బౌళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎండీ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి**

ఖానాపురం/నర్సంపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం కాకాని అశోక్ అన్నారు. మనుబోతులగడ్డలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లల ఇంటికి వెళ్లి సర్కారు బడుల ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భూక్యా ధర్మి, వాంకుడోత్ వాగ్య, భూక్యా వీరన్న, అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి, మహేశ్వరం, గురిజాల, ముగ్దుంపురం, మాదన్నపేట, ఇటుకాలపల్లి, కమ్మపల్లిలో బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కొర్ర సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలని సూచించారు.

## గ్రంథాలయ సిబ్బందికి మూడు నెలలుగా అందని జీతాలు

గిర్మాజీపేట, జూన్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యమా అని పస్తులుంటున్నామని గ్రంథాలయ సిబ్బంది వాపోతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెల జీతాలను ప్రభుత్వం చెల్లించపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సిన దుస్థితి దాపురించిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఆరుగురు లైబ్రేరియన్లు, ఆరుగురు పార్ట్‌టైం వర్కర్లు, పది మంది స్వీపర్లు పని చేస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మెయింటెన్స్ చార్జీలైన పత్రికలు, కరెంట్ బిల్లులు, స్టేషనరీ ఖర్చులకు సంబంధించిన నిధులను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అధికారులు, సిబ్బంది వారి జేబుల్లో నుంచి చెల్లించాల్సిన వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని పెండింగ్‌లో జీతాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోచమ్మమైదాన్‌లో గంజాయి బెడద

**మత్తుకు బానిసవుతున్న యువత**

పోచమ్మమైదాన్, జూన్ 8: వరంగల్ పోచమ్మమైదాన్ ఏరియాలో గంజాయి బెడద రోజురోజుకూ పెరిగిపోతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోచమ్మమైదాన్ సమీపంలోని సులభ్ కాంప్లెక్స్ గంజాయి అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. పక్కనే ఉన్న టెలిఫోన్ టవర్ వెనుక భాగంలో యువత గంజాయి తాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల యువత చెడిపోవడమే కాకుండా స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశాయిపేట రోడ్డు, ఎల్‌బీనగర్, ఎంహెచ్‌నగర్, చిన్నవడ్డేపల్లి చెరువు కట్ట ఏరియాలో రాత్రి వేళల్లో గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాంపురంలో సైకో వీరంగం

గీసుగొండ, జూన్ 8: మండలంలోని రాంపూరం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం సైకో హల్‌చల్ చేశాడు. గ్రామస్తులను తిడుతూ కొట్టేందుకు యత్నిస్తూ భయభ్రాంతులకు గురిచేయడంతో అతడిని బంధించి పోలీసులకు అప్పగించారు. ఇతర రాష్ట్రాల నుంచి టెక్స్‌టైల్ పార్కులో పనులు చేసేందుకు వచ్చే వారు మద్యానికి అలవాటు పడి మతిస్థిమితం కోల్పోయి ఇలా చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను భయాభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల మండలకేంద్రంలోని ఓ ఇంట్లో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి పడుకొని ఉండడంతో పోలీసులకు అప్పగించారు. ఇలాంటి ఘటనలు ఈ మధ్య కాలంలో తరచూ జరుగుతున్నయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

గీసుగొండ, జూన్ 8: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో ఆదివారం జరిగింది. సీఐ మహేందర్ కథనం ప్రకారం.. కొత్తపల్లి రమణ(28) శనివారం సాయంత్రం బైక్‌పై వరంగల్‌కు వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో మొగిలిచెర్ల క్రాస్‌రోడ్డులో ఆగి ఉన్న ఆటో ట్రాలీని వెనుక నుంచి ఢీకొట్టి కిందపడిపోయాడు. దీంతో అతడి తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు వరంగల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## ఉరేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య

సంగెం, జూన్ 8: అనారోగ్య కారణాల వల్ల ఉరేసుకొని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని రేక్యానాయక్ తండాకు చెందిన బానోత్ ద్వాలి(70) రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నది. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం తెల్లవారుజామున ఇంట్లోని కిటికీకి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మనవడు వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

## ఎమ్మెల్యే గోపీనాథ్ మృతి తీరనిలోటు

నర్సంపేట, జూన్ 8: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రజలకు ఆయన ఎనలేని సేవలందించారని, సామాన్యులకు సైతం అందుబాటులో ఉన్న నేతగా గుర్తింపు పొందారని తెలిపారు. గోపీనాథ్ మృతికి పెద్ది సంతాపం ప్రకటించారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రణధీర్



దుగ్గొండి, జూన్ 8: ఎస్సైగా ఆదివారం రావుల రణధీర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## భద్రకాళీ చెరువులో నవగ్రహ ద్వీపాలు

- **అర ఎకరం విస్తీర్ణంలో ద్వీపం**
- **పక్షులకు ఆవాస కేంద్రాల అభివృద్ధి**



భద్రకాళీ చెరువులో అభివృద్ధి చేస్తున్న ఐలాండ్‌లు

వరంగల్, జూన్ 8: భద్రకాళీ చెరువులో బర్డ్ సైలెన్స్ ఐలాండ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. పచ్చని చెట్లు పెంచి పక్షులకు ఆవాస కేంద్రాలను తీర్చిదిద్దుతున్నారు. చెరువులో నవగ్రహ ద్వీపా ల పేరుతో తొమ్మిది ఐలాండ్‌లను అభివృద్ధి చేసేందుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ శ్రీకా రం చుట్టింది. చెరువులోకి వివిధ జాతుల పక్షు లు వస్తుంటాయి. ప్రస్తుతం భద్రకాళీ చెరువు పూడికతీతలో భాగంగా చెరువు నీటిని బయటికి వదిలి పూర్తిగా ఖాళీ చేశారు. పూడిక మట్టిని బయటికి తరలిస్తున్నారు. కుడా ఆధ్వర్యంలో చేపట్టిన 3 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత మట్టిని భద్రకాళీ ఆలయ మాడ వీధుల నిర్మాణానికి వినియోగిస్తూనే, మిగతా మట్టిని చెరువులో నవగ్రహ ద్వీపాలు ఏర్పాటు చేసేందుకు వినియోగిస్తున్నారు. నవగ్రహాలకు అనుగుణంగా ఆయా గ్రహాలపై చెట్లు పెంచుతామంటున్నారు. జమ్మి, రావి, జిల్లెడు లాంటి చెట్లను పెంచనున్నారు. మొదటి నుంచి భద్రకాళీ చెరువు వద్దకు పక్షులు ఎక్కువగా వస్తుంటాయని, వాటికి అనుగుణంగా చెరువులో ద్వీపాలను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే చెరువు మధ్యలో పూడికతీత మట్టిని ద్వీపాల కోసం గుట్టలు గుట్టలుగా పోశారు. వాటిపై చెట్లను పెంచనున్నారు. చెరువు మధ్యలో అర ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఐలాండ్‌పై చెట్లను పెంచి వివిధ జాతుల అరుదైన పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకునేలా తీర్చిదిద్దనున్నారు. పర్యావరణ పరిరక్షణ, రణగొణ ధ్వనులతో పక్షులు ఇబ్బంది పడకుండా నగరం మధ్యలో ఉన్న భద్రకాళీ చెరువులో బర్డ్స్ సైలెన్స్ ఐలాండ్‌లను ఏర్పాటు చేయడంతో అరుదైన పక్షుల జాతులు సీజన్ల వారీగా ఇక్కడి వచ్చే అవకాశాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

## సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం: దొంతి



నర్సంపేట: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట/ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి, జూన్ 8: నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 3, 6, 7, 17, 19, 22, 24 వార్డులు, నర్సంపేట మండలంలోని భాంజీపేట, చంద్రయ్యపల్లి, ఖానాపురం మండలంలోని మనుబోతులగడ్డ, బండమీదిమామిడి తండా, చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ, దుగ్గొండి మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు మాత్రమే ఇండ్లు ఇచ్చేలా ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఖానాపురంలో ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబు, ఎంపీడీవో సునీల్‌రాజ్‌కుమార్, జగన్‌రెడ్డి, వెంకటప్రసాదరావు, నర్సింహ, సాగర్‌రావు, ముస్తఫా, చెన్నారావుపేట, దుగ్గొండిలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేరిణి విద్యార్థులకు ప్రశంసాపత్రాల పంపిణీ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ

పోచమ్మమైదాన్, జూన్ 8: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నటరాజ కృష్ణ నృత్య జ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. పేరిణి నాట్యంలో శిక్షణ పొందిన 120 మంది విద్యార్థులకు వరంగల్ దేశాయిపేటరోడ్డులోని పేరిణి నృత్యాలయం లో ఆదివారం ప్రశంసాపత్రాలు పంపిణీ చేశా రు. శిక్షణ శిబిరంలో విజయవంతంగా నేర్చుకుని ప్రతిభకు గుర్తింపుగా హనుమకొండ విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల పేరిణి నృత్య అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ చేతులమీదుగా అందజేశారు. అలాగే, పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ 14వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షురాలు మోత్కూరి చంద్రకళ రామకృష్ణ, వ్యవస్థాపక ప్రధాన నాట్యాచార్యులు గజ్జెల రంజిత్‌కుమార్, సలహాదారు సీహెచ్ నర్సింగారావు, నాట్యాచార్యులు పలనాటి శ్రీజ, బండారి వైష్ణవి, తొడసం సంతోష్, విద్యార్థులు జీవన్, విద్యశ్రీ, రవితేజ, జక్కోజు సుగంధిని పాల్గొన్నారు.

## మృగశిర కార్తె సందడి..



పట్టణంలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నర్సంపేట/సంగెం, జూన్ 8: పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మృగ శిర కార్తె సందడి నెలకొంది. ఈ సందర్భంగా అన్ని చెరువులు, కుంటల్లో మత్స్యకారులు చేపలు పట్టి విక్రయించారు. బొమ్మె చేపలు కిలో రూ. 350 నుంచి రూ. 400, తెల్ల చేపలు కిలో రూ. 200 నుంచి రూ. 250 వరకు విక్రయించారు. అలాగే, సంగెం మండలంలోని అన్ని గ్రామాల్లో చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. దీంతో కిలో చేపలను రూ. 200కు విక్రయించారు.

## బొమ్మలగుడిలో ఇష్టారాజ్యం

**ఆలయ ఆదాయానికి గండి**



కరీమాబాద్‌లోని బొమ్మలగుడి

కరీమాబాద్, జూన్ 8: కరీమాబాద్ ప్రాంతంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం(బొమ్మలగుడి)లో ఎవరికి వారే ఇష్టారాజ్యంగా పెత్తనం చలాయిస్తున్నారు. ఆలయంలోని ఫంక్షన్ హాల్‌కు ఏటా టెండర్ వేయాల్సిన అధికారులు కానరావడం లేదు. దీంతో కొన్నేళ్లుగా కార్యక్రమాల ఆదాయం లెక్కల్లోకి రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆలయ అభివృద్ధి కుంటుపడిందన్న వాదనలు ఉన్నాయి. గత పూజారి ఉద్యోగ విరమణ పొందగా, మరో పూజారిని నియమించారు. కానీ, ఏడాదికాలంగా ఆలయ పూజారికి సైతం జీతభత్యాలు ఇవ్వడం లేదు. ఆలయానికి ఆదాయం వచ్చేలా ప్రభుత్వ నిధులతో భవనాలు నిర్మించారు. గతంలో టెండర్ల ద్వారా ఏటా రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు వచ్చేవి. కానీ, బొమ్మలగుడిలో కొన్నేళ్లుగా టెండర్ నిర్వహణ నిలిచిపోయింది. పైగా అందులో చేపట్టిన కార్యక్రమాలకు రసీదు గాని లెక్కలు గాని లేవు. ఆలయంలో ఎవరికి వారిదే పెత్తనం. పాత కమిటీలు.. కొత్త కమిటీలు అధికార పార్టీ నాయకులమంటూ ఆలయ ఆస్తులతో పాటు ఆలయాన్ని తమ సొంతానికి వాడుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం బొమ్మలగుడిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారులు చర్యలు చేపట్టాలి



ఆలయ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు. విరాళాల రూపంలో వస్తున్న ఆదాయానికి లెక్కాపత్రం లేదు. ఆలయానికి ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నా అధికారులు చొరవ చూపడం లేదు. బొమ్మల గుడికి ఆదాయం సమకూరేలా అధికారులతో మాట్లాడతా. కొన్నేళ్లుగా జరుగుతున్న వాటిని అధికారులను అడిగి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. టెండర్ నిర్వహణ జరిగేలా చర్యలు చేపడతా.

– సిద్దం రాజు, కార్పొరేటర్

## ముస్లింలను మోసం చేసిన కాంగ్రెస్

**బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్**



ఖిలావరంగల్, జూన్ 8: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న ముస్లిం నాయకులు సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా మంత్రి వర్గంలో ఏ ఒక్క ముస్లింకు అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర జనాభాలో కీలకంగా ఉన్న ముస్లింలకు ఒక్క పదవీ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ శాఖ మంత్రిగా, హోంశాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా ముస్లింకు అవకాశం కల్పించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ముస్లింలకు ఇచ్చిన హామీలను నాడు కేసీఆర్ నిలబెట్టుకుంటే.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి పదవి ఇవ్వకుండా యావత్ ముస్లిం వర్గాన్ని కించపరిచారని విమర్శించారు.



రమణ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

## ప్రైవేట్ ఆస్పత్రిలో యువకుడి మృతి

- **బంధువుల ఆందోళన**
- **పోలీసుల రంగప్రవేశం**

కాశీబుగ్గ, జూన్ 8: నగరంలోని నర్సంపేటరోడ్డు వెంకట్రామ జంక్షన్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో యువకుడి మృతితో బంధువులు ఆందోళన చేసిన ఘటన ఆదివారం జరిగింది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన కొత్తపల్లి రమణ(35)ను వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే, వైద్యుల నిర్లక్ష్యం వల్లే రమణ మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు ఆరోపించారు. ఈ మేరకు దవాఖాన ఎదుట ఆందోళనకు దిగారు. ఆసుపత్రి ఆవరణలోని ఫర్నిచర్‌తోపాటు పూల కుండీలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేశారు. రెండు గంటలపాటు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆందోళనకారులతో నర్సంపేటరోడ్డులో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి రద్దు

ఖిలావరంగల్, జూన్ 8: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. పాలనాపరమైన కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని, నేడు ఎవరూ కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జూన్ 8: వరంగల్ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు వరంగల్ టౌన్ ఆపరేషన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మెయింటనెన్స్ వల్ల నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉర్సురోడ్డు, శివాలయం, గొల్లవాడ, సత్యసాయి నగర్, వినాయక నగర్, ఆర్‌టీఏ, టీచర్స్ కాలనీ, గవిచర్ల రోడ్, 4వ బటాలియన్, శేషాద్రి హిల్స్, శాంతినగర్, మెట్లబావి, శాకరాసికుంట, అండర్ బ్రిడ్జి రోడ్డులో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

గీసుగొండ/కాశీబుగ్గ/చెన్నారావుపేట, జూన్ 8: మండలంలోని బొడ్డుచింతలపల్లి శివరామ క్షేత్రంలో ప్రసన్నాంజనేయస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, చెన్నకేశవస్వామి, సుబ్రహ్మణ్యస్వామి నవగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రేటర్ వరంగల్‌లోని 3వ డివిజన్ పైడిపల్లి రాఘవేంద్రనగర్ ఆర్టీసీకాలనీ రోడ్డు నంబర్-3లో నాగేంద్రస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడలో ముదిరాజ్‌లు పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.



గణేశ్‌నగర్‌కు వెళ్లే అడవి మార్గం

## గణేశ్‌నగర్‌కు వెళ్లేదెలా?

**పక్కా రోడ్డు లేక రెండు గ్రామాల ప్రజల అవస్థలు**

నల్లబెల్లి, జూన్ 8: ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నాయి.. పోతున్నాయి.. కానీ, గణేశ్‌నగర్‌తోపాటు మురళీనగర్‌కు రోడ్డు వేయడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. కొండాపూర్ పంచాయితీ పరిధిలోని ఏజెన్సీ గ్రామాలైన గణేశ్‌నగర్, మురళీనగర్ 15 ఏళ్ల క్రితం ఏర్పడ్డాయి. 60 కుటుంబాలు ఉంటే ఈ రెండు గ్రామాలకు సరైన దారి లేక కాలినడకన వెళ్లాల్సి వస్తున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ హయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తారు రోడ్డును మంజూరు చేయించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారి మంజూరును రద్దు చేయించారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి తారు రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పోచమ్మమైదాన్: వరంగల్ 12వ డివిజన్‌లోని బూర కనకయ్య కాలనీ, వీవర్స్‌కాలనీ-2లో వీధి లైట్లు వెలగకపోవడంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల నుంచి వీధిదీపాలు లేక చిమ్మచీకట్లు కమ్ముకోవడంతో మహిళలు, పిల్లలు రోడ్డుపై నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

